వాయిస్ ఆఫ్ ప్రజలు
# వాయిస్ టుడే
TGTEL/25/A2649
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
బుధవారం, జనవరి 14, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## మేడారం జాతరకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు... మహిళలకు ఉచిత ప్రయాణం



మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు టీజీఎస్ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి 3,495 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో జాతర జరగనుంది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనంగా వసూలు చేయాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి అనుమతి ఉంది.



## మున్సిపల్ ఎన్నికల్లో నంబర్‌వన్‌గా నిలుస్తాం

- పురపాలక పోరులో ఒంటరిగానే బరిలో దిగుతామని స్పష్టం
- గెలిచే సామర్థ్యం ఉన్న వారికే టికెట్లు
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- నిబద్ధ కార్యకర్తలకే ప్రాధాన్యమని ప్రకటన

హైదరాబాద్: రాబోయే పురపాలక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, నంబర్‌వన్ పార్టీగా నిలిచి తన సత్తాను చాటుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల ఇష్టాగోష్ఠిలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుల అవసరం లేదని, ఒంటరిగానే బరిలో దిగేందుకు పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. పొత్తుల కోసం ఇప్పటివరకు ఎవరూ తమను సంప్రదించలేదని స్పష్టం చేశారు. గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని, పార్టీ కోసం కష్టపడిన నిబద్ధత గల కార్యకర్తలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా ఎదుగుదలను చూసి ఓర్వలేక కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి నేతలు అర్థంలేని విమర్శలు చేస్తున్నారని రామచందర్‌రావు

(మిగతా 2వ పేజీలో)

# ప్రాజెక్టుల భూసేకరణకు వేగం పెంచాలి

- ప్రాజెక్టుల కింద బ్రాంచి, పిల్లకాలువల పనులు ఆలస్యం కాకూడదు
- భూసేకరణను తక్షణమే పూర్తి చేయాలని ఇంజినీర్లకు ఆదేశం
- నీటిపారుదల శాఖపై సీఎం ప్రత్యేక సమీక్ష
- చనాఖా--కోర్ట, సదర్మాట్, చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులపై దృష్టి
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల డిజైన్లు కేంద్రానికి పంపాలన్న సూచన

హైదరాబాద్: రాష్ట్రంలో చేపడుతున్న ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల కింద బ్రాంచి కాలువలు, పిల్లకాలువల వ్యవస్థను సకాలంలో పూర్తి చేయడానికి అవసరమైన భూసేకరణను వేగంగా పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణలో జాప్యం వల్ల ప్రాజెక్టుల ప్రయోజనాలు రైతులకు ఆలస్యంగా చేరుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 16న ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చనాఖా--కోర్ట ఎత్తిపోతల పంపులు, సదర్మాట్ బ్యారేజీ పనుల పురోగతిపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలోని చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల పరిస్థితిపై కూడా సమీక్షించారు. పనుల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు తీసుకెళ్లాలని, అవసరమైన నిర్ణయాలను వేగంగా తీసుకోవాలని అధికారులను సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన

(మిగతా 2వ పేజీలో)





## పాలన వైఫల్యాల్ని కప్పిపుచ్చేందుకే సిట్‌లు: కేటీఆర్

- కాంగ్రెస్ పార్టీ అక్రమాలు, అవినీతిపై సిట్ ఎందుకు లేదని నిలదీత
- మీడియాను బెదిరించేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆరోపణ
- ఇసుక దందాలు, భూకబ్జాలు, లిక్కర్ కుంభకోణంపై మౌనం ఎందుకని ప్రశ్న
- ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రభుత్వ వైఖరి ఉందన్న విమర్శ

హైదరాబాద్: రాష్ట్రంలో పాలన వైఫల్యాలు, ప్రజా సమస్యలపై పెరుగుతున్న అసంతృప్తి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాలు (సిట్‌లు) ఏర్పాటు చేస్తోందని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్యాయాలు, అక్రమాలు, అవినీతిపై ఎందుకు సిట్‌ను ఏర్పాటు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఒక టీవీ ఛానల్ ప్రసారం చేసిన కథనాన్ని ఆధారంగా చేసుకుని అనేక ఇతర ఛానళ్లు, డిజిటల్ మీడియాపై సిట్ వేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని

(మిగతా 2వ పేజీలో)

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు.. తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ

- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడి
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధిక ఓటర్లు




## సాహిత్య లోకానికి తీరని లోటు

ప్రముఖ కవయిత్రి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ కన్నుమూత



## ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ సరికొత్త చరిత్ర

- ఖరీఫ్‌లో 70.82 లక్షల టన్నుల కొనుగోళ్లు పూర్తి
- దేశంలో ఏ రాష్ట్రం సాధించని రికార్డు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



# ఇరాన్‌లో అగ్నికాండ

## ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో 2,003కు చేరిన మృతుల సంఖ్య

- వీధుల్లోకి వెల్లువెత్తిన ప్రజాగ్రహం, దగ్ధమైన బ్యాంకులు- దుకాణాలు
- ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపివేతతో జనజీవనం అస్తవ్యస్తం
- నిరసనకారులపై ఉక్కుపాదం, వేల మందిపై అరెస్టులు
- ట్రంప్ వ్యాఖ్యలతో అంతర్జాతీయ రాజకీయాల్లో ఉద్రిక్తత



దుబాయ్/వాషింగ్టన్: ఇరాన్‌లో ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రజల్లో పేరుకుపోయిన ఆగ్రహం అగ్నిపర్వతంలా పేలుతోంది. వేలాదిగా జనం వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసనలు తెలుపుతున్నారు. ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వాహనాలు, ఏటీఎంలకు నిప్పంటిస్తున్నారు. పరిస్థితి చేయి దాటుతుందన్న భయంతో అయతొల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, ఆన్‌లైన్, మొబైల్ సేవలను నిలిపివేసింది. ఆన్‌లైన్ సదుపాయాలు లేకపోవడంతో బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిలిచిపోయి ప్రజలు కరెన్సీ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల తర్వాత కొందరికి మాత్రమే అంతర్జాతీయ ఫోన్‌కాల్

(మిగతా 2వ పేజీలో)



## వీధి కుక్కల బెడదపై సుప్రీం హెచ్చరిక

- కుక్క కాటుకు తప్పనిసరిగా పరిహారం చెల్లించాలన్న ధర్మాసనం
- నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రాలపై భారీ జరిమానాలు
- ప్రతి దాడి బాధితుడిపై జీవితాంత ప్రభావమని వ్యాఖ్య
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారిపైనా అసహనం

## సీఎం, మంత్రి, ఐఏఎస్ అధికారిణిపై పోస్టులు... సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు



- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి, ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకున్న పోస్టులపై దర్యాప్తు
- అవమానకరమైన కంటెంట్‌పై నమోదైన 2 కేసుల విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం
- హైదరాబాద్ సీపీ వి.సి. సజ్జనార్ నేతృత్వంలో 8 మంది సభ్యులతో సిట్ ఏర్పాటు
- సీఎం మార్ఫ్ ఫొటో, ఐఏఎస్ అధికారిణిపై ఫేక్ న్యూస్ కేసులపై దర్యాప్తునకు ఆదేశాలు

# ఇరాన్‌లో అగ్నికాండ



సౌకర్యం పునరుద్ధరించడంతో, విదేశాల్లో ఉన్న బంధువులకు తాము ఎదుర్కొంటున్న నరకయాతనను వివరించారు. టెహ్రాన్ నగరమంతా పోలీసులు భారీగా మోహరించారని, ఎక్కడ చూసినా భయానక వాతావరణమే నెలకొందని వారు తెలిపారు. నిరసనకారులపై పోలీసులు కాల్పులకు దిగడంతో ఇప్పటివరకు 2,003 మంది మరణించినట్లు అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. మృతుల్లో 1,850 మంది ఉద్యమకారులు, 135 మంది పోలీసులు ఉన్నారని తెలిపింది. ఉద్యమంలో పాల్గొనని తొమ్మిది మంది చిన్నారులు, తొమ్మిది మంది సాధారణ పౌరులు కూడా కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణల్లో వేలాది మంది గాయపడగా, గత రెండు వారాల్లోనే 10,700 మందికిపైగా నిరసనకారులను ప్రభుత్వం అరెస్ట్ చేసింది. పరిస్థితి అదుపు తప్పుతోందన్న ఆందోళనతో ఖమేనీ ప్రభుత్వం లాఠీచార్జ్, బాష్పవాయుగోళాల ప్రయోగం, అవసరమైతే తుపాకులు వాడేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. నిరంకుశ పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ జనం మరింతగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. దుకాణాలు మూతపడటంతో పాటు సాధారణ జీవితం పూర్తిగా స్తంభించింది. ఈ క్రమంలో 26 ఏళ్ల ఉద్యమకారుడు ఇర్ఫాన్ సొల్తానీని ఉరితీయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజాగ్రహం మరింత పెరిగింది. ఖమేనీని దూషించాడన్న ఆరోపణలతో ఇర్ఫాన్‌పై దేవునిపై యుద్ధం ప్రకటించాడని కేసులు నమోదు చేసి, తక్షణమే శిక్ష అమలు చేయాలని నిర్ణయించడంపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు ఈ నిర్ణయాన్ని ఖండిస్తూ ఇరాన్‌పై ఒత్తిడి తెస్తున్నాయి. మరోవైపు ఇరాన్ పరిస్థితులపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరసనకారులకు మద్దతుగా వ్యాఖ్యలు చేశారు. "ఇరానియన్లు దేశభక్తులు. నిరసనలను మరింత ఉధృతం చేయండి. హంతకులు చేసిన దారుణాలకు వారు మూల్యం చెల్లించుకోవాల్సిందే" అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇరాన్ ప్రభుత్వంతో అన్ని స్థాయి సమావేశాలను రద్దు చేసినట్లు ప్రకటించిన ట్రంప్, త్వరలో సాయం అందిస్తామని పేర్కొనడం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీస్తోంది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లో ఉన్న తమ పౌరులు వెంటనే ఆ దేశాన్ని విడిచిపోవాలని అమెరికా హెచ్చరిక జారీ చేసింది.

# వీధికుక్కల బెడదపై సుప్రీం హెచ్చరిక

**కుక్క కాటుకు తప్పనిసరిగా పరిహారం చెల్లించాలన్న ధర్మాసనం**

**నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రాలపై భారీ జరిమానాలు**

**ప్రతి దాడి బాధితుడిపై జీవితాంత ప్రభావమని వ్యాఖ్య**

**వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారిపైనా అసహనం**

**ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం**



న్యూఢిల్లీ: వీధి కుక్కల బెడదను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైతే కఠిన పరిణామాలు తప్పవని సుప్రీం కోర్టు హెచ్చరించింది. కుక్క కాటుకు గురైన ప్రతి ఘటనకు సంబంధిత రాష్ట్రం తప్పనిసరిగా పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. వీధి కుక్కల దాడి వల్ల బాధితుడిపై పడే ప్రభావం జీవితాంతం ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మంగళవారం వీధి కుక్కల సమస్యపై విచారణ చేపట్టిన ధర్మాసనం, ప్రజల ప్రాణ భద్రతే తమకు ప్రధానమని స్పష్టం చేసింది. కుక్కల దాడుల్లో చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొంది. ఇలాంటి పరిస్థితిని ఇకపై సహించబోమని, కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు ఆదేశించింది. వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వ్యక్తులు, సంస్థల పట్ల కూడా ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఒక సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే, ఆ ప్రాణ నష్టానికి ఆ సంస్థ బాధ్యత వహించాల్సిన అవసరం లేదా?" అని ధర్మాసనం ప్రశ్నించింది. కేవలం భావోద్వేగాల పేరుతో ప్రజల భద్రతను పక్కన పెట్టడం తగదని స్పష్టం చేసింది. "మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం. కుక్కల పట్ల మాత్రమే కాదు, మనుషుల ప్రాణాల పట్ల కూడా మేం సమానంగా ఆందోళన చెందుతున్నాం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వీధి కుక్కల దాడులు, కుక్క కాట్ల ఘటనలు కొనసాగితే ప్రతి కాటుకు, ప్రతి మరణానికి గానూ తాము నిర్దేశించే భారీ పరిహారాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రజల ప్రాణ రక్షణకు రాష్ట్రాలు బాధ్యతగా వ్యవహరించాలని, అవసరమైన విధానాలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించింది.

## తెలంగాణలో 9 జిల్లాల్లో రైస్ మిల్లులపై దాడులు

### నిఘా ఆధారంగా దాడులు చేశామన్న విజిలెన్స్ డీజీ శిఖా గోయల్

హైదరాబాద్: తెలంగాణలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీ&ఈ) అధికారులు కొరడా ఝుళిపించారు. 9 జిల్లాల్లోని 19 రైస్ మిల్లులపై ఏకకాలంలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో రూ.60 కోట్లకు పైగా విలువైన ధాన్యం దారి మళ్లినట్లు గుర్తించారు. ఈ అక్రమాలకు సంబంధించి 14 మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, ఒక మిల్లును మూసివేశారు. ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు (కస్టమ్ మిల్లింగ్ రైస్ – సీఎంఆర్) రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. ఈ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తుంది. అయితే, జనవరి 12న మహబూబాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సూర్యాపేట, నల్గొండ, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మిల్లులపై దాడులు జరిగాయి. ఈ తనిఖీల్లో 14 మిల్లుల్లో అక్రమాలు జరిగినట్లు తేలింది. మొత్తం 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం, 1.72 లక్షల బస్తాలు మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. ప్రధానంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రూ.19.73 కోట్లు, సూర్యాపేటలో రూ.19.32 కోట్లు, నారాయణపేటలో రూ.15.91 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నష్టాన్ని రాబట్టాలని, వారి లైసెన్సులను రద్దు చేసి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని పౌరసరఫరాల శాఖకు సిఫార్సు చేశారు. తీవ్రమైన ఉల్లంఘనల కారణంగా పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలం, పూసాల గ్రామంలోని జానకీరామ ఇండస్ట్రీస్‌ను మూసివేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని ఏమాత్రం సహించబోమని విజిలెన్స్ డీజీ శిఖా గోయల్ స్పష్టం చేశారు. "నిఘా వర్గాల సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించి భారీ మోసాన్ని బయటపెట్టాం. మరో ఐదు మిల్లులకు రికార్డుల నిర్వహణలో లోపాలపై నోటీసులు జారీ చేశాం" అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అయితే, ఇలాంటి అక్రమాలు ప్రభుత్వ లక్ష్యాలకు గండికొడుతున్నాయి. భవిష్యత్తులోనూ తనిఖీలు కొనసాగుతాయని, ఎవరైనా అక్రమాలను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

### సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి, ఐఏఎస్ అధికారిణిని

## లక్ష్యంగా చేసుకున్న పోస్టులపై దర్యాప్తు

**అవమానకరమైన కంటెంట్‌పై నమోదైన 2 కేసుల విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం**

**హైదరాబాద్ సీపీ వి.సి. సజ్జనార్ నేతృత్వంలో 8 మంది సభ్యులతో సిట్ ఏర్పాటు**

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఓ మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అవమానకరమైన, అసభ్యకరమైన కంటెంట్ పోస్ట్ చేసిన రెండు కేసుల దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసుల లోతైన విచారణ కోసం డీజీపీ శివధర్ రెడ్డి 8 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు. వివరాల్లోకి వెళితే, సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను మార్ఫింగ్ చేసి 'తెలంగాణ పబ్లిక్ టీవీ' అనే వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేసినందుకు కావలి వెంకటేశ్‌పై నారాయణపేట జిల్లాలో కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత గుల్ల నరసింహ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. మరోవైపు, ఓ మంత్రికి, మహిళా ఐఏఎస్ అధికారిణికి సంబంధించి తప్పుడు వార్తలు ప్రసారం చేశారంటూ ఎన్టీవీ, టీ న్యూస్ చానళ్లతో పాటు పలు యూట్యూబ్ చానెళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై హైదరాబాద్ సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఫిర్యాదు చేశారు. ఓ మహిళా ఐఏఎస్ అధికారిణికి, రాజకీయ నేతకు సంబంధం అంటగడుతూ, ఆమెకు 'కంఫర్ట్ పోస్టింగ్‌లు' ఇచ్చారని నిరాధార ఆరోపణలు చేశారని, ఇది సివిల్ సర్వీసెస్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వార్తలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడిని కోల్పోయిన తర్వాత జీవితంపై ఆసక్తి లేదని, ఇలాంటి వ్యక్తిత్వ హననం చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఈ రెండు కీలక కేసుల దర్యాప్తును సిట్ వేగవంతం చేయనుంది.

# ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ సరికొత్త చరిత్ర



**ఖరీఫ్‌లో 70.82 లక్షల టన్నుల కొనుగోళ్లు పూర్తి**

**దేశంలో ఏ రాష్ట్రం సాధించని రికార్డు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

హైదరాబాద్: సంక్రాంతి పండగ వేళ తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో చారిత్రక మైలురాయిని దాటిందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ (2025–26)లో రాష్ట్రవ్యాప్తంగా 70.82 లక్షల టన్నుల వరి ధాన్యం కొనుగోళ్లు జరిగాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వెల్లడించారు. ఇంతకుముందు 2020–21లో నమోదైన 70.2 లక్షల టన్నుల రికార్డును అధిగమిస్తూ తెలంగాణ సరికొత్త రికార్డును సృష్టించిందని మంత్రి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టలేదని స్పష్టం చేశారు. ఈ కొనుగోళ్ల ద్వారా 13.97 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందారని వివరించారు. రైతులకు కనీస మద్దతు ధర కింద మొత్తం రూ.16,606 కోట్లు చెల్లించామని, అదనంగా బోనస్ రూపంలో రూ.1,425 కోట్లు అందించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నదానికి ఈ గణాంకాలే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం, అలాగే రైతాంగం సంపూర్ణ సహకారం ఈ రికార్డు సాధనకు కీలకంగా నిలిచిందని మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల నాయకత్వంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అనుకూల విధానాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చిన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ఒక సవాల్‌గా స్వీకరించిందని ఉత్తమ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 8,448 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వేగవంతంగా కొనుగోళ్లు పూర్తి చేయడం ద్వారా తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో నంబర్‌వన్‌గా నిలుస్తాం



ఆరోపించారు. రాజకీయ పార్టీ అయిన జనసేన రాష్ట్రంలో పోటీ చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును గతంలో కేసీఆర్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సెంటిమెంట్‌కు వాడుకుంటున్నాయని విమర్శించారు. జిల్లాల పునర్విభజన అంశంపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. 'సంచార్ సాథీ' యాప్‌ను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా డబ్బులు డెబిట్ చేయాలంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం తప్పేనని, అయితే ఆ వీడియోలను బహిర్గతం చేయడం సరికాదని రామచందర్‌రావు అభిప్రాయపడ్డారు. అలాంటి చర్యల వల్ల కొందరు అవమానానికి గురై తీవ్ర మనస్తాపానికి లోనవుతున్నారని, ఇలాంటి ఘటనలు ఆత్మహత్యలకు కూడా దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

## పాలన వైఫల్యాల్ని కప్పిపుచ్చేందుకే సిట్‌లు: కేటీఆర్

అంతర్గత కుమ్ములాటలు, అవినీతి ఆరోపణలు ప్రజల ముందుకు రాకుండా అడ్డుకునేందుకే ఇలాంటి గారడీలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. మీడియాను భయపెట్టడం, ప్రశ్నించే గొంతులను అణచివేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక దారుణ ఘటనలు జరుగుతున్నాయి. ఓ పారిశ్రామికవేత్త తలకు తుపాకి పెట్టి రూ.300 కోట్లను డిమాండ్ చేసిన ఘటనపై ఎందుకు సిట్ లేదు? ఇసుక దందాల పేరుతో కోట్ల రూపాయలు దండుకుంటుంటే, హైదరాబాద్ శివార్లలో వందల కోట్ల భూకబ్జాలు జరుగుతుంటే దర్యాప్తు ఎందుకు జరగడం లేదు? జాతీయ రహదారి గుత్తేదారును మారణాయుధాలతో బెదిరించిన ఘటనపై విచారణ ఎందుకు చేపట్టడం లేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. అలాగే కస్తూర్బా పాఠశాలల్లో బంకర్ బెడ్ల కొనుగోలులో జరిగిన అక్రమాలు, వందల కోట్ల లిక్కర్ కుంభకోణం వంటి అంశాలపై ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని నిలదీశారు. ఈ అన్ని అంశాలపై చర్యలు తీసుకోకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సిట్‌లను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. మీడియా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణమని, దానిపై దాడులు చేయడం ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు విచారణ సంస్థలను వాడుకుంటే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పూర్తిగా కోల్పోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన చర్యలపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## సాహిత్య లోకానికి తీరని లోటు

**ప్రముఖ కవయిత్రి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ కన్నుమూత**

నారాయణగూడ : ప్రముఖ కవయిత్రి, చిత్రకారిణి, రచయిత్రి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ (96) మంగళవారం హైదరాబాద్‌లోని గోషామహల్ ప్రాంతం జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె దివంగత మహాకవి గుంటూరు శేషేంద్రశర్మ భార్యగా సాహిత్య వర్గాల్లో విశేష గుర్తింపు పొందారు. ఇందిరాదేవి కవిత్వం, చిత్రకళ, రచనలతో బహుముఖ ప్రతిభను చాటుకున్నారు. అల్లా ఇక్బాల్, గాలిబ్, అరబిందో వంటి మహానుభావుల రచనల నుంచి ప్రేరణ పొంది సాహిత్య రంగంలోకి అడుగుపెట్టారు. యుక్తవయసు నుంచే ఫొటోగ్రఫీపై ప్రత్యేక ఆసక్తి చూపుతూ అరుదైన ఫొటోల సేకరణను ప్రారంభించారు. 1964లో ఆమె తొలి కవితా సంపుటి 'ది అపోసల్' ప్రచురితమై సాహిత్య వర్గాల్లో విశేష ఆదరణ పొందింది. ఆ తర్వాత 1965, 1966 సంవత్సరాల్లో ఆమె రచనలు పుస్తక రూపంలో వెలువడ్డాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీకి తొలి అధ్యక్షురాలిగా, ఉర్దూ అకాడమీ ఛైర్‌పర్సన్‌గా ఆమె సేవలందించారు. 1973లో వరల్డ్ పోయెట్రీ సొసైటీ ఇంటర్‌కాంటినెంటల్ అధ్యక్షుడు కృష్ణ శ్రీనివాస్ ఆమెను సాహిత్య రంగంలో నోబెల్ బహుమతికి నామినేట్ చేయడం విశేషం. ఈ గౌరవం అందుకున్న తొలి భారతీయ మహిళగా ఇందిరాదేవి చరిత్రలో నిలిచారు. ఆమె మరణంతో తెలుగు సహా భారతీయ సాహిత్య ప్రపంచం ఓ గొప్ప కవయిత్రిని కోల్పోయిందని సాహిత్యవేత్తలు నివాళులర్పిస్తున్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు.. తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ

హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు, 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా, కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా, అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా రిజర్వేషన్లు ఖరారైన తర్వాత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలక శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

## ప్రాజెక్టుల భూసేకరణకు వేగం పెంచాలి

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరావాస డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి కేంద్ర జల సంఘానికి పంపించి ఆమోదం పొందాలని సీఎం ఆదేశించారు. ఈ అంశంలో ఎలాంటి నిర్లక్ష్యం తట్టుకోబోమని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ ప్రక్రియ ఏ స్థాయిలో ఉందో సమగ్రంగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరం, ఎంత మేరకు సేకరణ పూర్తయ్యింది, ఎక్కడ సమస్యలు ఉన్నాయో స్పష్టమైన వివరాలతో నివేదిక ఇవ్వాలని తెలిపారు. ప్రాజెక్టుల పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నా భూసేకరణ ఆలస్యం వల్ల నీరు అందించలేని పరిస్థితి రాకూడదని సీఎం హెచ్చరించారు. రైతులకు నీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అందుకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే మున్సిపల్, ఎంపీటీసీ-జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలి

## ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ



సికింద్రాబాద్, జనవరి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచకుండా మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదని, యుద్ధమే జరుగుతుందని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రికి ఆర్ కృష్ణయ్య లేఖ రాశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావనకు తీసుకురాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల అమలుపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు, కనీసం చర్చ కూడా చేయలేదు. ప్రతిపక్షం చర్చకు తీసుకు రాకపోవడం దారుణమన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ ప్రతిపదికగా కాకుండా స్వతంత్రంగా జరుగుతాయని ఉదారంగా యున్నారు. కానీ ఇప్పుడు ఎట్టి పరిస్థితులలో 42 శాతం కు పెంచే వరకు వదిలిపెట్టి ఉండమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా 42 శాతం కు పెంచిన తర్వాతనే ఎన్నికలకు వెళతామని కొన్ని వందలసార్లు ప్రకటించి మోసం చేసి ఎన్నికలకు వెళ్లారనీ, బీసీలకు అన్యాయం చేశారనీ అన్నారు. 42 శాతం ప్రకటించి మరలా దానిని 22 శాతం తగ్గించి ఆచరణలో 17శాతం తగ్గించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఇది చాల దుర్మార్గమని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఎంత తగ్గించి -- అన్యాయం చేయాలనీ చూస్తుంటే బి.సి.లు తిరగబడి మొత్తం సీట్లులో 51శాతం సర్పంచ్ పదవులు బి.సి.లు స్వాదీనం చేసుకున్నారానీ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి, కానీ ఆ రాష్ట్రాలలో బీసీలు తిరగబడలేదు మన రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్ర బంద్ జరపడం గర్వించదగిందని అన్నారు. ఇది మన రాష్ట్రంలోని బీసీల చైతన్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికి ఢిల్లీకి 64 సార్లు వెళ్లారు. ఒక్కసారి కూడా బీసీల గురించి ప్రధానమంత్రికి కలవలేదనీ, కనీసం అఖిలపక్షాన్ని కూడా ఢిల్లీకి తీసుకు వెళ్లలేదన్నారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆర్. కృష్ణయ్య గుర్తు చేశారు. హైకోర్టు తీర్పుల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే నిర్వహిస్తామని, 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు జరిపిస్తామని సీఎం అప్పట్లో చెప్పారని తెలిపారు. ఇప్పుడు మాట మార్చి మున్సిపల్ ఎన్నికలకు సన్నాహాలు చేయడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

సర్పంచ్ ఎన్నికలు ఏ ఒక్క పార్టీకి పూర్తిగా అనుకూలంగా రాలేదని, బీసీల రాజకీయ చైతన్యంతో జనరల్ స్థానాల్లోనూ 52 శాతం బీసీ సర్పంచులు విజయం సాధించి తెలంగాణలో బీసీల రాజకీయ శకానికి నాంది పలికారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకొని పోవడానికి రాజకీయ కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. ఈసారి కోర్టుల్లో కేసులు వాదించేందుకు సీనియర్, జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న ప్రముఖ న్యాయవాదులను నియమించాలని, హైకోర్టులో దాఖలైన 62 కేసులపై సమగ్రంగా చర్చించాలని కోరారు. తమ కేసు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా జీఓ నెం.9 ఆధారంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. కేసు గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. దురదృష్టవశాత్తు బి.సి వ్యతిరేకతతో గెలవకపోతే రాజ్యాంగ సవరణ కోసం పోరాటం చేయాల్సి ఉంటుందని ప్రభుత్వానికి సూచించారు. బీసీల హక్కుల కోసం అన్ని సంఘాలు ఏకమై ఉద్యమిస్తాయని హెచ్చరించారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉంటామని ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు మాట మార్చుతున్నాయని విమర్శించారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేశామని, ఇకముందు బీసీ జేఏసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన 5,380 మంది బీసీ సర్పంచులతో జనవరి రెండో వారంలో బీసీ సర్పంచుల రాష్ట్ర ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



## ముంపు రహిత ఆగమయ్య నగర్ లక్ష్యం

### 64 లక్షలతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనుల క్షేత్రస్థాయి పరిశీలన

### డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

ఎల్బీనగర్ జనవరి 14( వాయిస్ టుడే): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆగమయ్య నగర్ కాలనీలో వర్షాకాలంలో ఎదురవుతున్న ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా 64 లక్షల రూపాయల నిధులతో చేపడుతున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ నిర్మాణ పనులను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు నీరు నిరవధికంగా పారేలా ప్రణాళికాబద్ధంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తూ, కాలనీ ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలతో పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ పరిధిలో మంచినీటి పైపు లైన్ రిటైనింగ్ వాల్ ఉన్న నేపథ్యంలో, ఎటువంటి లీకేజీలు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజల సమస్యలను ముందుగానే గుర్తించి, పరిష్కార దిశగా వేగంగా చర్యలు తీసుకోవడమే తమ లక్ష్యమని, ఆగమయ్య నగర్ కాలనీని పూర్తిగా ముంపురహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఈ స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదయ్య, వసుధారెడ్డి, సుజాత, శ్రీరాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత

### మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్



సికింద్రాబాద్, జనవరి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యతను కల్పించాలని, అవసరమైన పక్షంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్లు, సబ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులకు సూచించారు. ట్రాన్స్ కో ఉత్తర మండలం సర్కిల్ అధికార యంత్రాంగం మంగళవారం సికింద్రాబాద్ శాసనసభ్యులు పద్మారావుగౌడ్‌తో మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో సామవేశమైంది. సూపర్ ఇంటేన్డింగ్ ఇంజనీర్ గోపయ్య నేతృత్వంలో డివిజనల్ ఇంజనీర్ బ్రహ్మానందం, ఏడీఈలు మహేష్ కుమార్, దుర్గా ప్రసాద్, సెక్షన్ ఇంజనీరింగ్ అధికారులు శ్రీకాంత్, వరలక్ష్మి, కృష్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పంపిన సందేశం, శుభాకాంక్షలను ఎస్.ఈ. గోపయ్య తదితరులు పద్మారావు గౌడ్‌కు అందించారు. ప్రజా అవస రాలకు అనుగుణంగా విద్యుత్ శాఖ కార్యకలాపాలను విస్తరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## ఎంపీ వద్దిరాజు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలుగు రాష్ట్రాల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పంటలు ఇళ్లకు చేరే సందర్భంగా తెలుగు ప్రజలు భోగి,మకర సంక్రాంతి,కనుమ పండుగలను కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుందని తన సందేశంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ఈ పండుగలు మన తెలుగు ప్రజల ఘనమైన సంస్కృతిని ప్రపంచానికి చాటి చెబుతున్నాయన్నారు. భోగి మంటలు వేసే,పతంగులు ఏగురవేసే సందర్భాలలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఎంపీ రవిచంద్ర యువతకు హితవు పలికారు.ఈ పండుగలను కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకోవలసిందిగా ఎంపీ వద్దిరాజు కోరుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాసులతో పాటు దేశం నలుమూలల, విదేశాలలో నివసిస్తున్న, స్థిరపడిన తెలుగు వారందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికల హామీలను అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్

### ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి

### ఉప్పల్ నియోజకవర్గంలో గృహ జ్యోతి పథకం లబ్ధిదారులు లక్షా కుటుంబాలు..

### ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి పథకాల రూపంలో అమలు చేస్తున్నారని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో గృహ లక్ష్మి పథకం కింద లక్ష కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయన్నారు.ఉప్పల్ డివిజన్ లోని ఇందిరానగర్, కురుమ నగర్ లో మంగళవారం రజితపరమేశ్వర్ రెడ్డి డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నుంచి వచ్చిన గ్రీటింగ్స్ ను గృహ జ్యోతి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అర్హులై ఉండి



నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ను వినియోగించిన పేద, మధ్య తరగతి ప్రజలకు జీరో బిల్లు కింద ఉచితంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లుగా ఈ సందర్భంగా రజితపరమేశ్వర్ రెడ్డి తెలిపారు.ఇదే తరహాలో ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ నిఖిల్ రెడ్డి ఉప్పల్, ఏఈ సత్యనారాయణ రెడ్డి పీర్జాదిగూడ, లైన్మెన్ కిషన్ నాయక్,మురళి, డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, ఈగ ఆంజనేయులు, లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, తోకటరాజు, సిడి వెంకటేష్, ప్రేమ్, అలుగుల, అనిల్, దుర్గం నవీన్ యాదవ్, గంజాయి నర్సింగరావు, ఏసూరు మహేందర్, గోవింద్ కుమార్, రంగుల శేఖర్,బజార్ నవీన్ గౌడ్, డప్పు రాజు, తోకాట రాహుల్ , డప్పు రాహుల్, మండల నాగరాజు, మస్కవుతేజ్, డప్పు నందు, గుండె వెంకటేష్, నాగోల్ నవీన్, పి రామ్ చందర్, ముద్దం సుధాకర్ రెడ్డి ,రమేష్ యాదవ్, టీ విజయ సింగ్ , పి మహేందర్ , మహేష్ గౌడ్ , జి కొమురయ్య, వినోద్, ఎస్ రామస్వామి , సత్యనారాయణ చారి,మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## మర్రి చెన్నారెడ్డి గారి 107వ జయంతి

ఇందిరా పార్క్‌లోని ఆయన సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించాంన పులిగారి గోవర్ధన్ రెడ్డి,ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తు గవర్నర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా ఎల్లప్పుడూ అసాధారణమైన,గొప్ప నాయకత్వాన్ని ప్రదర్శించిన మర్రి చెన్నారెడ్డి సేవలను స్మరించుకోవడం జరిగింది. మర్రి చెన్నారెడ్డి కృషి,దృఢ సంకల్పం స్ఫూర్తిదాయకం ఆయన ప్రస్థానం తెలుగు రాష్ట్రాల రాజకీయ, సామాజిక విషయాల్లో తరాతరాలకు ప్రేరణగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో కావాడిగుడ ఇంగ్లీష్ యూనియన్ చైర్మన్ జూ. గోవర్ధన్ రెడ్డి మర్రి శశిధర్ రెడ్డి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీనివాస్ నెల మాసికం హాజరైన ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

నాచారం (వాయిస్ టుడే ):స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను తండ్రి బి శ్రీనివాస్ నెల మాసికం కార్యక్రమం మంగళవారం ఆర్య నగర్ లోని వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, స్వేరోస్ ఇంటర్నేషనల్ ఫౌండర్ చైర్మన్ రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఆర్. పి. ఐ. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇన్చార్జి మేజర్ చంద్రకాంత్ తదితరులు హాజరై శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కుమార్ షాను కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలియజేస్తూ, పరామర్శించారు. శ్రీనివాస్ మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ఆనంద్ నర్సింగ్ రావు వంశీ వివిధ పార్టీల నాయకులు, ఆర్య నగర్ వాసులు పాల్గొన్నారు.



## సైబరాబాద్‌లో “అరైవ్ అలైవ క్యాంపెయిన్

శేరిలింగంపల్లి, జనవరి 13 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “అరైవ్ అలైవ రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్‌ను మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని అన్ని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించారు. ఈ క్యాంపెయిన్ జనవరి 13 నుంచి 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు. మాదాపూర్ లోని మైండ్‌స్పేస్ లో నిర్వహించిన కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ.. మీరు సురక్షితంగా ఇంటికి చేరితే మీ కుటుంబం సంతోషంగా ఉంటుందని, అదే “అరైవ్ అలైవ ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు. ఎక్కువగా మానవ తప్పిదాల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల అనేక కుటుంబాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ను ధరించడం, వేగ పరిమితులను పాటించడం వంటి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు

### పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి, జనవరి 13 (వాయిస్ టుడే): నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, కార్పొరేటర్లకు, నాయకులకు, కార్యకర్తలకు, పాత్రికేయులకు, అధికారులకు, అనాధికారులకు, మిత్రులకు, శ్రేయాభిలాషులకు మరియు బంధు మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి అందరూ ఆనందోత్సాహల మధ్య భోగి పండగను జరుపుకోవాలని, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ భోగి రోజున తెల్లవారుజామునే లేచి భోగిమంటలు వేయడం ఆనవాయితీ అని ఆవు పేడతో తయారైన పిడకలు, మామిడి, రావి, మేడి చెట్ల అవశేషాలు, తాటాకులు లాంటివి భోగి మంటల్లో వేస్తారు అని, అంతే కాకుండా ఇంట్లోని పాత వస్తువులను కూడా భోగి మంటల్లో వేస్తుంటారు అని అంటే పనికిరాని చెత్త ఆలోచనలకు స్వస్తి పలికి.. కొత్త మార్గంలోకి పయనించాలని దీని అర్థం అని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలియజేసారు. దక్షిణాయనం నుంచి ఉత్తరాయణం ప్రారంభం కానుండటంతో.. కాలంతో వచ్చే మార్పులను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండాలని బోధించేదే భోగి పండుగ అని, ప్రజలందరు సుఖ సంతోషాలతో చక్కటి వాతావరణంలో ఆనందయకంగా కుటుంబ సభ్యులతో కలిసి మీరు ఆనందోత్సాహల మధ్య భోగి పండగను జరుపుకోవాలని గాంధీ తెలియజేశారు.

# ముఖ్యమంత్రి అబద్దాలు చెప్పుతూ ప్రజలను మోసం చేస్తున్నారు

## మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



సికింద్రాబాద్ జనవరి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ముఖ్యమంత్రి అబద్దాలు చెప్పుతూ ప్రజలను మోసం చేస్తున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో సనత్ నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన కార్పొరేటర్ లు, మాజీ కార్పొరేటర్ లు, మాజీ బోర్డు సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జిహెచ్ఎంసి లోనే ఉందని, మల్కాజిగిరి లో కలపలేదని పచ్చి అబద్దాలు చెప్పారని అన్నారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని నూతనంగా ఏర్పడ్డ ప్రకాష్ నగర్, మోండా డివిజన్ లను మల్కాజిగిరి జోన్ పరిధిలోని బోయిన్ పల్లి సర్కిల్ లో కలిపిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అదేవిధంగా సికింద్రాబాద్ ప్రాంతంలోని బేగంపేట, మహంకాళి, గోపాలపురం, కారా?నా, బోయిన్ పల్లి, తదితర పలు పోలీస్ స్టేషన్ లను మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి కలిపారని, ఇది సికింద్రాబాద్ ను మల్కాజిగిరి లో కలిపినట్లు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికే అధికారులు కార్యకలాపాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ నెల 17 వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి నిర్వహించనున్న శాంతి ర్యాలీ అనుమతి కోసం లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు ఈ నెల 5 వ తేదీన హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ లో దరఖాస్తు చేస్తే 10 రోజులుగా హైదరాబాద్ కమిషనరేట్ నుండి మల్కాజిగిరి కమిషనరేట్ కు పంపారని, అది తమ పరిధి కాదని అక్కడి నుండి హైదరాబాద్ అదనపు కమిషనర్ కు పంపగా, రైల్వే స్టేషన్ మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని తిరిగి మల్కాజిగిరి కమిషనర్ ఆఫీస్ కు పంపారని వివరించారు. పోలీసు అధికారులు కూడా తమ పరిధులు ఏమిటో తెలియక అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలే కారణం అన్నారు. మన ఆత్మగౌరవం, అస్థిత్వంను దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు కాకపోతే మనకు తీరని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. 220 సంవత్సరాల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరు లేకుండా చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలిపారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు, పలు సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నాయని అన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే పలు సంఘాలు మద్దతు తెలపగా, ఈరోజు మేరు సంఘం, ఆటో యూనియన్, విశ్వకర్మ సంఘం తదితర సంఘాల ప్రతినిధులు సమావేశానికి హాజరై సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ లు సామల హేమ, శైలజ, ప్రసన్న, సునీత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, సభ్యులు పాండు యాదవ్, అనిత ప్రభాకర్, నళిని కిరణ్, లోకనాథం, పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గానికి ఒక జర్నలిస్టుకు కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వాలి

**ప్రతి సమస్యని మొదటగా గుర్తించేది జర్నలిస్టులే... తీర్చేది జర్నలిస్టులే...**

**భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్...**



సికింద్రాబాద్, జనవరి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని నియోజకవర్గాల్లో డివిజన్ కు ఒక జర్నలిస్టులకు కార్పొరేటర్ గా సముచిత అవకాశం కల్పించాలని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యంగౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియాకు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, అభివృద్ధి చేయడంలో ఒక జర్నలిస్టుకు తెలిసినట్టు మరి ఎవరికి తెలియదని అన్నారు. ప్రాంతీయ సమస్యలను ప్రభుత్వాల ముందుకు తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిని రాజకీయంగా ప్రోత్సహించడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని సత్యంగౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ నియోజకవర్గాల్లో ప్రజలతో నిత్యం మమేకమై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించగల సామర్థ్యం కలిగి ఉన్నారని,యూనిఫామ్ లేకుండా,జీతాలు లేకున్నా నిస్వార్థంగా ప్రజాసేవ చేసే జర్నలిస్ట్ లకు రాజకీయ అవకాశాలు కల్పిస్తే ప్రజలకు మరిన్ని సేవాలందించగలరని, ఇప్పటి వరకు కొన్ని నియోజకవర్గాలకే పరిమితమైన అవకాశాలు ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు అవకాశం ఇవ్వాలని రాజకీయ పార్టీలు ఆదిశగా ఆలోచించాలని, దీనివల్ల రాజకీయాల్లో అభివృద్ధి, పారదర్శకత పెరుగుతాయని జర్నలిస్ట్ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయని సత్యంగౌడ్ అన్నారు. ఈ అంశంపై రాజకీయ పార్టీల అధిష్టానాలు ఎలా స్పందిస్తాయో, జర్నలిస్టులకు వాస్తవంగా ఎలాంటి అవకాశాలు కల్పిస్తారో వేచి చూడాల్సి ఉంది. అయితే ఈ డిమాండ్ మాత్రం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటుందనే చెప్పాలి.



## ఎంపీ వద్దిరాజును సత్కరించిన కేతినేని తదితర ప్రముఖులు

నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను టీడీపీ ఖమ్మం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ తదితర ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించారు.ఖమ్మం బురహాన్ పురంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎంపీ వద్దిరాజును హరీష్, నాయకులు నున్నా నవీన్,కాసాని బ్రహ్మం,చింతపల్లి నాగేశ్వరరావు, లక్ష్మణ్, బాబు తదితరులు కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 13: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నేషనల్ స్కిల్ అకాడమీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఇంటర్మీడియట్ పాస్, ఇంజనీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు, అలాగే వివిధ రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్థులు మరియు పని చేసే నిపుణులను అధునాతన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే లక్ష్యం. అకాడమీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & మెషిన్ లెర్నింగ్‌లో డిప్లొమా, పిజి డిప్లొమా మరియు మాస్టర్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. శిక్షణ ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది. తర్వాత పరీక్షలు ఉంటాయి. విజయవంతమైన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆమోదించిన సర్టిఫికెట్లు ప్రదానం చేయబడతాయి.

కోర్సుల వ్యవధి ఐదు నుండి పది నెలల వరకు ఉంటుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, హెల్త్‌కేర్, ఫైనాన్స్, ఇంజనీరింగ్, మీడియా, మార్కెటింగ్, ప్రభుత్వం, రక్షణ, వ్యవసాయం, రిటైల్, గేమింగ్ మరియు విద్య వంటి రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తుండటంతో, నైపుణ్యం కలిగిన ఏఐ నిపుణులకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ థింక్ ట్యాంక్ అయిన నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, రాబోయే ఐదు సంవత్సరాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా 40 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించబడతాయని భావిస్తున్నారు. ఈ కోర్సులు పూర్తి చేసే అభ్యర్థులకు విదేశాలలో అధిక జీతం వచ్చే ఉద్యోగాలు సహా విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు [illegible] లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం, హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ 9505800050 ని సంప్రదించండి అని వెంకట రెడ్డి అన్నారు.

## స్కూల్ గేమ్స్‌లో జోషిత మెరుపులు



హైదరాబాద్, జనవరి 13: రాంచీలో జరిగిన 69వ జాతీయ పాఠశాల క్రీడల (అండర్-17)లో హైదరాబాద్‌కు చెందిన జోషిత వీరవల్లి కాంపౌండ్ ఆర్చరీ ఒలింపిక్ రౌండ్‌లో స్వర్ణం, క్వాలిఫికేషన్ రౌండ్‌లో రజతం సాధించింది. సీబీఎస్ఈ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మహర్షి విద్యా మందిర్ (కొండాపూర్) పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ 15 ఏళ్ల విద్యార్థిని, ఒలింపిక్ రౌండ్ (ఎలిమినేషన్) విభాగంలో 150 పాయింట్లకు గాను 142 పాయింట్లు సాధించి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిష్ఠ గుప్తా (141) మరియు గుజరాత్‌కు చెందిన చేతనా శంకర (139) కంటే ముందు నిలిచింది. వ్యక్తిగత క్వాలిఫికేషన్ రౌండ్‌లో జోషిత 691 పాయింట్లు సాధించి, నిష్ఠ (692) కంటే వెనుకబడి, చేతన (683) కంటే ముందు నిలిచింది. జోషిత కొంపల్లిలోని అరుణ్ ఆర్చరీ అకాడమీలో అంతర్జాతీయ ఆర్చర్ మరియు రిఫరీ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణి



హైదరాబాద్, జనవరి 13: సమాజ సేవకురాలు, భద్రకాళి సమేత వీరభద్రస్వామి సేవా సమితి వ్యవస్థాపకురాలు కాసుల అనసూయ రెండవ వర్ధంతి సందర్భంగా కాసుల అనసూయ, వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులు మంగళవారం పుస్తకాలు, నోట్బుక్స్, స్టేషనరీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది కాసుల వినోద్ అధ్యక్షత వహించారు. ప్రముఖ అధ్యాత్మిక వేత్త కాకునూరి సూర్యనారాయణ మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఉదయమే మేల్కొని వ్యాయామం, చదువుతో పాటు ధ్యానం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సమయాన్ని కేటాయించి వారిని మంచి మార్గంలో పయనించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సమాజ సేవకులు ధర్మేందర్, ప్రసాద్, వరలక్ష్మి, రాజశేఖర్, గణేష్ నాయక్, ఉదయ్ కుమార్, భాస్కర్ రెడ్డి, శ్యామ్లను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సింపోజియంలో గెలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వర్షిక, వర్షిత, విశాల్, వరుణ్, అనన్య, మిథున్, శృతిక లు బహుమతులను పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రకాష్, ట్రస్ట్ చైర్మన్ కాసుల మల్లికార్జున్, సర్రా విజయభారతి, శ్వేత, ప్రవంతి, స్వాతి, లక్ష్మీ, వందన, సంజన, శారద, అందాలు, రాణి, చందు, సతీష్, రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

## వీధి కుక్కల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలి

### సహారా ఎస్టేట్స్ కాలనీ లెక్చరర్స్ కాలనీ డివిజన్

ఎల్బీనగర్ జనవరి 14( వాయిస్ టుడే ): ఎల్.బి.నగర్ నియోజకవర్గ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తో కలిసి ఈరోజు మన మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్ కాలనీ లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్ట కాలనీ నివాసుల కోరిక మేరకు అట్టి కాలనీల యందు జరిగిన సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఇటీవల సమయంలో వీధి కుక్కలు ఈ కాలనీలలో మహిళను, చిన్నారిని తీవ్రంగా కరచిన నేపథ్యంలో దానికి సంబంధించిన వెటర్నరీ అధికారులను అట్టి సమావేశానికి పిలవడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాబోయే పదిహేను రోజుల్లో సహారా మరియు వీరన్నగుట్ట పరిసర ప్రాంతాల్లో రోడ్ల మీద తిరిగే వీధి కుక్కలను పట్టుకొని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయాలని ఆదేశించారు. అలాగే కాలనీ వాసులను ఇంట్లో మిగిలిన తినుబండారాలు, అన్నం తదితర వస్తువులను తమ తమ కాలనీల నందు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బండి వారికి వేయాలని కోరారు. ప్రస్తుతం ఫతుల్లగూడ జంతు కేంద్రం నందు దాదాపు 650 కుక్కలకు ప్రతిరోజు భోజనం పెడుతూ సంరక్షణ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే ఆపరేషన్ చేసిన కుక్కలను దూర అడవుల్లో వదలాలని అధికారులను కోరడం జరిగింది.

అనంతరం ఎల్.బి.నగర్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జంతు సంరక్షణ చట్టం ప్రకారం ఎక్కడ కుక్కలను పట్టుకుంటామో మళ్ళీ తిరిగి ఆపరేషన్ చేసి అక్కడే వదలాలని చట్టం ఉందని అన్నారు. దూర ప్రాంతాల్లో వదిలే హక్కు లేదని అన్నారు. అలాగే వెటర్నరీ సిబ్బందిని పెంచి కుక్కలను పట్టుకొని వాటికి రేబిస్ రాకుండా ఇంజెక్షన్ చేస్తామని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో కుక్కకాటు బారిన ఏ ఒక్కరు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. దానికి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, సీనియర్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, కోసనం ధనలక్ష్మి, సీనియర్ నాయకులు రుద్ర యాదగిరి, విజయ్ భాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, అనిల్ కుమార్, కెపిల్ గౌడ్, వెంకన్న, పారంద నర్సింగ్, సురేష్, కాలనీవాసులు జానీ, పార్థ సారథి, ప్రభాకర్, ఓబి సింగ్, నాగభూషణం, సుదర్శన్ రెడ్డి, నర్సింహాయాదవ్, శ్రీనివాస్, ఎల్లస్వామి, రవి, కృష్ణ, సత్తయ్య, వెంకట్ రావు మరియు పలు సర్కిల్ల వెటర్నరీ అధికారులు రవిచంద్ర, యాదగిరి, అగ్నివేశ్ మరియు చుట్టుపక్కల కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ కుంటలో ఎగిరిన పతంగి

### బస్తీవాసులతో వేడుకల్లో పాల్గొన్న హైడ్రా కమిషనర్...

### గాలిపటం ఎగురవేసిన రంగనాథ్...



సికింద్రాబాద్, జనవరి 13 (వాయిస్ టుడే ప్రతినిధి): అంబరపేటలోని బతుకమ్మకుంటలో ఎగిరిన పతంగులు ఇంద్రధనుస్సు తలపించాయి. ఒకదానితో ఒకటి పోటీ పడి నింగివైపు దూసుకెళ్లిన పతంగులను చూసి పిల్లలు కేరింతలు కొట్టారు. బతుకమ్మకుంట చెంత స్థానికులు ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పాల్గొన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంత రావు తో కలసి హైడ్రా కమిషనర్ గాలిపటాలు ఎగురవేశారు. దీంతో అక్కడ పండగ వాతావరణం నెలకొంది. ఆక్రమణలు తొలగించి హైడ్రా రూపొందించిన బతుకమ్మ కుంట తో ఇక్కడ వాతావరణం మారిపోయిందని చెబుతూ స్థానికులు మిఠాయిలు తినిపించుకున్నారు. మహిళలతో పాటు స్థానికులు హైడ్రా కమిషనర్ ను కలసి బతుకమ్మ చెరువును పునరుద్ధరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉదయం, సాయంత్రం చెరువు చుట్టూ వాకింగ్ చేస్తున్నామని తెలిపారు. మా ఆరోగ్యాలు మెరుగవుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి, హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

**సౌకర్యాలు పెంచుతాం..**

చెరువు చెంత మహిళలు, చిన్నారులు వినియోగించేలా వ్యాయామ పరికరాలను సమకూర్చుతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. వృద్ధులు సేదదీరేలా మరిన్ని కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఇక్కడ సెక్యూరిటీ సిబ్బందికి విశ్రాంతి గదులు నిర్మిస్తామన్నారు. హైడ్రా అభివృద్ధి చేసిన చెరువు చెంత స్థానికులు పెద్దఎత్తున సేదదీరడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందని అన్నారు. నగరవ్యాప్తంగా మరిన్ని చెరువులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తలచిందన్నారు. మొదటవిడత హైడ్రా చేపట్టిన 6 చెరువులలో ఇప్పటికీ బతుకమ్మ కుంట ప్రారంభం అవ్వగా మిగతా 5 చెరువులు ఒకటి రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. మరో 14 చెరువులు ఈ ఏడాది కొత్తగా చేపడుతున్నామన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ ఎంతో సాహసోపేతంగా చేస్తోందన్నారు. ఆక్రమణలు తొలగించి చెరువులను అభివృద్ధి చేయడం సాధారణ విషయం కాదన్నారు. తెలంగాణ ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, హైడ్రా అధికారులు తిరుమల్, ఉమామహేశ్వర రావు, ఇన్స్పెక్టర్ బాలగోపాల్, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బందిపై నూతన సర్పంచుల వేధింపులు అరికట్టాలి, పండగకైనా వేతనాలు ఇవ్వాలి

## గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):– నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామపంచాయతీ సిబ్బందినీ తొలగిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని,వేధింపులు అరికట్టాలని పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు ) రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం రోజు స్థానిక సంస్థలు..రెవెన్యూ అదనపు జిల్లాకలెక్టర్ భాస్కరరావు.. జిల్లా డిపిఓ కి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన సర్పంచులు గ్రామపంచాయతీ సిబ్బందిని అనేక విధాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని, మా పార్టీ వారు కాదనీ, ఎన్నికల్లో మాకు ఓటు వేయలేదని రకరకాలుగా ఇబ్బందులు పెడుతూ కార్మికుల్ని వెళ్లగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని పోచంపల్లి ,తుర్కపల్లి లాంటి మండలాలలో ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామపంచాయతీ కార్మికులకు దసరా పండుగ నుండి నేటి వరకు తుర్కపల్లి మండలం వేలుపల్లి లాంటి అనేక గ్రామాలలో జిల్లాలో వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా భార్య పిల్లలతో పస్తులు ఉండవలసిన పరిస్థితి వచ్చిందనీ కావున వెంటనే కనీసం పండగ కోసం ఒక నెల వేతనం తప్పకుండా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు ను డిపిఓ విష్ణువర్ధన్ రెడ్డిని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా గత స్థానిక సంస్థ ఎలక్షన్లలో గ్రామపంచాయతీ సిబ్బంది నామినేషన్ నుండి ఎలక్షన్ పూర్తయ్యే వరకు సిబ్బంది అదనపు డ్యూటీలు చేయడం జరిగిందనీ, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు కూడా ఈసారి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదనీ, ప్రతి కార్మికునికి రోజుకి వెయ్యి రూపాయల చొప్పున ఇవ్వాలని అధికారుల ను కోరడం జరిగిందన్నారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ భాస్కర రావు,డిపిఓ తో మాట్లాడి వెంటనే ఒక నెల వేతనం ఇవ్వాలని వారం రోజుల లోపు ఎలక్షన్లలో డ్యూటీ చేసిన కార్మికులందరికీ డబ్బులు ఇవ్వాలని,ఎలాంటి కారణం లేకుండా సిబ్బందిని తొలగిస్తే ఆ సర్పంచ్ పంచాయతీ ,కార్యదర్శులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిపిఓకి క్రింది అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరేకంటి రాము రాష్ట్ర కమిటీ సభ్యులు బందల బిక్షం తదితరులు పాల్గొన్నారు.



# రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




కరీంనగర్, జనవరి 13 (వాయిస్ టుడే): భూములు,ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వ నిబంధనలు మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సబ్ రిజిస్ట్రార్లను, తహసిల్దార్లను ఆదేశించారు.రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,సబ్ రిజిస్టార్లు, తహసిల్దార్లు, సుడా అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్లు, నిషేధిత జాబితా, లేఅవుట్ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన విధంగా అన్ని శాఖల వద్ద నవీకరించిన భూముల నిషేధిత జాబితా ఒకే రకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ జాబితా సబ్ రిజిస్టర్, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, తహసిల్దార్ స్థాయిలో తప్పక అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ జాబితాకు సంబంధించిన ప్రతిని కార్యాలయాల్లో అందరికీ అందుబాటులో ఉండే చోట ప్రదర్శించాలని తెలిపారు. కొనుగోలు,అమ్మకం దారులు భూముల రిజిస్ట్రేషన్‌కు వెళ్లే ముందు తగిన కొన్ని సూచనలను తెలియజేస్తామని, ఈ మార్గదర్శకాలు కొనుగోలు, అమ్మకం దారులు చదువుకునేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, ఇంటి నెంబరు ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే మున్సిపల్ నుండి జారీ చేసిన ఎస్ఓపి ఉత్తర్వుల్లోని మార్గదర్శకాలు అనుసరించాలని అన్నారు. అక్రమంగా ఉన్న హౌస్ నెంబర్లు ఇప్పటికే రద్దు చేశామని,ఆ జాబితా అన్ని సబ్ రిజిస్టర్ ఆఫీసర్లకు పంపిస్తామని తెలిపారు. రిజిస్టర్ చేసే ముందు రిజిస్టారు ప్రభుత్వ నిబంధనలన్నీ పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే సిసిఏ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్లాట్ల రిజిస్ట్రేషన్ కు ముందు లేఅవుట్ ప్రక్రియను పరిశీలించాలని అన్నారు. ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. తహసిల్దార్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సందర్శించాలని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారదర్శకంగా పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు,జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్,జిల్లా రిజిస్ట్రార్ పాల్గొన్నారు.



# విదేశీ సంస్కృతిని విడనాడండి..!

## వినూత్నంగా జన్మదిన వేడుకలు

### – అభినందించిన పీఠాధిపతుల.. – విద్యార్థులు, వృద్ధులకు వస్త్రదానం

ఝరాసంగం జనవరి 13 (వాయిస్ టుడే) : పాశ్చాత్య పోకడలను పక్కన పెట్టి, మన సనాతన ధర్మాన్ని ప్రతిబింబించే విధంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి, సిద్ధేశ్వరానంద గిరి పేర్కొన్నారు. విదేశీ సంస్కృతి ప్రభావాన్ని విడనాడాలని వారు పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం దిగువవాడి గ్రామానికి చెందిన రైతు పూజ గురునాథ్ రెడ్డి దంపతులు తమ కుమారుడు చిన్నారి అక్షయ రెడ్డి జన్మదిన వేడుకలను దత్తక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, దత్తాత్రేయ స్వామివారికి అభిషేకం, మహా రుద్రాభిషేకం చేశారు. ఆశ్రమంలో చదువుకుంటున్న వేద పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, భక్తుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి, వారందరికీ నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సుమారు 120 మందికి మూడు పూటల భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. సమాజానికి ఉపయోగపడేలా వినూత్నంగా జన్మదిన వేడుకలు నిర్వహించినందుకు పీఠాధిపతులు చిన్నారి అక్షయ రెడ్డిని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఆశీర్వదించి అభినందించారు.

# ప్రజా పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయి.. ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

## – సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్




యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. (వాయిస్ టుడే ప్రతినిధి):– ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ అన్నారు. ప్రజల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది మార్క్సిస్టులేనని వారు తెలియజేశారు.ఆదివారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశం (పిక్నిక్) శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్ అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జహంగీర్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచమంతా శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతూ ఉంటే మన దేశంలో మాత్రం మూఢాచారాలకు కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని విమర్శించారు. సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజురోజు పెరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. సోషలిస్టు దేశాల్లో ఎర్ర జెండా పాలనలో ఆకలి, దారిద్ర్యం, దోపిడి, అణిచివేత లేకుండా ప్రజలందరికీ విద్యా, ఉద్యోగం ఉపాధి అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బిజెపి పాలనలో మాత్రం కులాల, మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. విద్యా, వైద్యం సామాన్య ప్రజలకు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా గెలిచిన సర్పంచ్ లు గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం చేయాలన్నా, గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్న రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి తగిన నిధులు కేటాయించాలని జహంగీర్ సూచించినారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి, చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఎదునూరి మల్లేష్, కొండమడుగు నాగమణి, సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచులు బొల్లెపల్లి కుమార్, గునుగుంట్ల కల్పన, ఏదునూరి ప్రేమలత, గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్, సిపిఎం మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్, బొల్లపల్లి లీల, గ్రామ నాయకులు ఎండి జహంగీర్, కడారి కృష్ణ, స్వామి, మల్లేష్, కిషన్, పాండు, బాల మల్లేష్, బాలరాజు, కళ్యాణి, జ్యోతి, హేమలత, కావ్య, ప్రీతి, నజీమా తదితరులు పాల్గొన్నారు.




# యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గట్టి పోటీ

(వాయిస్ టుడే) యాదగిరిగుట్ట : యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ భారతీయ జనతా పార్టీ ఈరోజు భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత నరేంద్ర మోడీ ది వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పట్టణ ప్రజలను కోరుతున్నాం పట్టణంలో కూడా ఎన్నో ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వ పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి మీరు ఓటు వేసి మా కార్యకర్తలను ఆశీర్వదిస్తే మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాం పట్టణంలోని అన్ని వార్డుల్లో బిజెపి పోటీ చేస్తుంది ఏ పార్టీతో పొత్తు పెట్టుకుని ఆలోచన బీజేపీకి లేదు కేవలం డబ్బు , మద్యం ఆశ చూపించి కొందరు వ్యక్తులు గెలవాలని చూస్తున్నారు అలాంటి వారికి దూరంగా ఉండి నిజాయితీగా పని చేసే వారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని తెలిపారు కచ్చితంగా యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ బీజేపీ కైవసం చేసుకుంటుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు .ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి ,పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్ ,జిల్లా భానుచందర్ ,కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ ,పలుగుల సురేష్ ,సీనియర్ నాయకులు లెంకల పల్లి శ్రీనివాస్,బందరపు మల్లేష్ ,బోడ సురేష్ ,శివరాత్రి శ్రీశైలం ,ఆకుల దేవేందర్ ,వంశీ ,అనిల్ ,శివ, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత...అవేర్నెస్ ప్రోగ్రాం

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి మేడిపల్లి సీఐ ఆర్, గోవింద్ రెడ్డి

మేడిపల్లి వాయిస్ టుడే న్యూస్, జనవరి 13 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైమ రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో మంగళవారం రోజు మల్కాజ్గిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్ "అనే ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని ఉప్పల్ డిపో జోనల్ వర్క్ షాపులో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మేడిపల్లి ఆర్. గోవింద్ రెడ్డి, మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులు మరియు సాధారణ ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే యువత హెల్మెట్ ని కచ్చితంగా ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ సూచనలను తప్పకుండా పాటించాలని, అతివేగంతో నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోకూడదని సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ వర్క్ షాప్ మేనేజర్ జగన్ మాట్లాడుతూ, దాదాపు 80% రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్లనే జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేడిపల్లి తహసిల్దార్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడప రాదని మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపకూడదనే అంశాలపై స్పష్టంగా వివరించారు, అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థోపెడిక్ డా" రోహిత్ మాట్లాడుతూ, ప్రమాదం చెప్పి రాదు అని సురక్షంగా వాహనాన్ని నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో జరిగిన తీవ్రమైన గాయాల ద్వారా తను చేసిన సర్జరీలను అనుభవపూర్వకంగా వివరించారు, అదేవిధంగా ఈ కార్యక్రమంలో తీవ్రమైన గాయాలైన బాధితులు రోడ్డు ప్రమాదంలో తన కుటుంబాన్ని కోల్పోయిన బాధితులు తాము ఎంత శోకసంద్రం లో సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా శోభను అనుభవిస్తున్నారు అని వివరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి సురక్షితంగా చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. "అరైవ్ అలైవ్ -- గమ్యానికి చేరుకోండి, ప్రాణాలతో" అనే నినాదాన్ని ప్రజలందరి ద్వారా ఓత్ చేయించి తమ జీవితంలో అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిపో చెంగిచెర్ల డిపో డ్రైవర్సు సిబ్బంది, ఆటో యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్స్ మరియు లారీ అడ్డ ప్రతినిధులు డ్రైవర్స్, లోకల్ ప్రజా ప్రతినిధులు దాదాపు 200 మంది పాల్గొన్నారు.



# బాల స్కేటర్లకు పది వేల ఆర్థిక సహాయం

## క్రీడాకారులకు ఆర్థిక సహాయం చేసిన చెంగిచెర్ల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్

బోడుప్పల్ , వాయిస్ టుడే న్యూస్, జనవరి 13 : నేపాల్‌లో ఈ నెల 18 నుంచి 24 వరకు జరగనున్న అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన చెంగిచెర్ల క్రాంతి కాలనీకి చెందిన బాల స్కేటర్లు ఇప్పకాయల విశ్వంక్ తేజ్, ఇప్పకాయల ఇషాన్ తేజ్‌లకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కొత్త రవి గౌడ్ పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇప్పకాయల రాములు -- సంధ్య దంపతుల కుమారులైన విశ్వంక్ తేజ్ ఐదో తరగతి, ఇషాన్ తేజ్ ఏడో తరగతి చదువుతున్నారు. కోచ్ సయ్యద్ ముక్తార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఈ ఇద్దరు చిన్నారులు తెలంగాణ స్కేటింగ్ రంగంలో చిచ్చర పిడుగులుగా గుర్తింపు పొందుతున్నారు. ఇప్పటికే వీరు మూడు జాతీయ పతకాలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక పతకాలను సాధించారు. అరవై మూడో నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్, రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, రైస్ హాకీ స్కేటింగ్ ఫెడరేషన్, తెలంగాణ రోలర్ హాకీ స్కేటింగ్ లీగ్, ఆంధ్ర--మహారాష్ట్ర రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్, నేషనల్ రోలర్ హాకీ సిరీస్ వంటి ప్రతిష్టాత్మక పోటీల్లో పాల్గొని ప్రతి ఈవెంట్‌లో పతకాలు సాధించిన ఘనత వీరిది. అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా కొత్త రవి గౌడ్ ఈ బాల స్కేటర్లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నేపాల్ వేదికగా జరిగే ఈ పోటీల్లో భారత్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్ దేశాల జట్లు పాల్గొననున్నాయి. ప్రపంచ స్థాయి మెడల్ సాధించి దేశానికి, తెలంగాణకు, చెంగిచెర్లకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మణ్ నాయక్, ఈదుల రాజు గౌడ్, మరికంటి అశోక్ రెడ్డి, ఫైన్ లిఫ్ట్, డాన్ యుగేందర్, గోల్డ్ రాజు, బుల్లెట్ రమేష్, నారాయణ రావు, దయ్యాల కుమారస్వామి తదితరులు పాల్గొని బాల స్కేటర్లను అభినందించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రభుత్వం సహకారం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో విశ్వ విజేతలుగా నిలుస్తారని బాలల తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సాధించిన జాతీయ పతకాలే వారి ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయం భవిష్యత్ తరాల యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

# యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ని సందర్శించిన జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ సార్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి అలాగే ఎస్పీగా ప్రమోషన్ వచ్చినందు నా..నూతన సంవత్సర క్యాలెండర్ అలాగే యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి ప్రసాదం ఇచ్చి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.. మీ కోనపురం రాజు యాదగిరిగుట్ట.



# అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా అమలు చేస్తున్నాం

**ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**మేడారంలో మరో 200 సంవత్సరాలు నిలిచేలా రాతి నిర్మాణాలతో అభివృద్ధి పనులు**

**అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జనవరి 13 : ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్లలా భావిస్తూ ప్రజా ప్రభుత్వం సమన్వయంతో అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార--పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మున్సిపల్ మార్కెట్ భవనం, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.7 కోట్ల వ్యయంతో మంజూరైన అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దమ్మపేట గ్రామంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో అమలు చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. సమ్మక్క--సారలమ్మ మహాజాతర ఈ నెల 28, 29, 30, 31 తేదీలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇది ఆదివాసీల అతిపెద్ద ఆధ్యాత్మిక జాతరగా మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి తరలివచ్చే మహోత్సవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా, కాకతీయుల కాలం నాటి నిర్మాణ శైలిని తలపించేలా రాతి నిర్మాణ పద్ధతిలో మరో 200 సంవత్సరాలు నిలిచే విధంగా మేడారం సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటనకు రానున్నారని, 19న మేడారం పునరుద్ధరణ, అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గత రెండు సంవత్సరాల కాలంలో ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుతూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని మంత్రి తెలిపారు. దాని ఫలితంగానే ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 శాతం స్థానాల్లో ప్రజలు ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఇదే విశ్వాసంతో రానున్న ఎన్నికలలో కూడా ప్రజలు ప్రజా ప్రభుత్వానికే మద్దతు ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ జనవరి 14 (వాయిస్ టుడే) : మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ వి గార్డెన్స్ నందు మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 600 మంది లబ్ధిదారులకు 6 కోట్ల రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చెక్కులపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ తహసీల్దార్ లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..



## సామాజిక న్యాయ వేదిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**తెలంగాణ యాదవ మహాసభ అధ్యక్షులు కూరాకుల నాగ భూషణం చేతుల మీదుగా ఆవిష్కరణ**

ఖమ్మం జిల్లా జనవరి 13 వాయిస్ టుడే : ఖమ్మం జిల్లా కేంద్రంలోని కూరాకుల నాగ భూషణం స్వగృహంలో సామాజిక న్యాయ వేదిక ఖమ్మం జిల్లా అధ్యక్షులు అధ్యక్షత మేరకు వహించిన కార్యక్రమంలో పాల్గొని సామాజిక న్యాయ వేదిక 2026 క్యాలెండర్ ను మంగళవారం తెలంగాణ యాదవ మహాసభ అధ్యక్షులు కూరాకుల నాగ భూషణం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శెట్టి భాస్కర్ సామాజిక న్యాయ వేదిక ఖమ్మం జిల్లా అధ్యక్షులు,ఖమ్మం జిల్లా తెలంగాణ యాదవ మహాసభ కార్యదర్శి గుమ్మ రోశయ్య యాదవ్,యువజన విభాగం జడ మల్లేష్ యాదవ్,జల్లెల శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర సంఘం నాయకులు,యాదవ సంఘం నాయకులు చిత్తారు శ్రీనివాసరావు, సాంబయ్య,మొగరపు రోశయ్య,అమడగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 16న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి: ఎస్ కే యం పిలుపు



సూర్యాపేట : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జనవరి 16 సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం ) జిల్లా కన్వీనర్ లు మల్లు నాగార్జున రెడ్డి, మండారి డేవిడ్ కుమార్, బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఎస్కేయం సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనేక సంవత్సరాల పాటు పోరాటం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లు గా విభజించిందన్నారు. మోడీ ప్రభుత్వం ఒకపక్క ప్రజా సంక్షేమం అంటూ మరోపక్క కార్పొరేట్ శక్తులకు వేల కోట్ల రూపాయలు కట్టబెడుతున్నారు. 2005 విద్యుత్ సవరణ బిల్లు, విత్తన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులు అయిన అంబానీ, అదానీలకు దోచి పెడుతుందన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి బి జి రామ్ జి బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టి పేదల నోట్లో మట్టి కొట్టిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జనవరి 14న సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో భోగి మంటల్లో బిల్లు పత్రాలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 26న సూర్యాపేట జిల్లా కేంద్రంలో మోటారు సైకిల్ ర్యాలీ జరుగుతుందని ఈ కార్యక్రమాలలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ కే యం జిల్లా కన్వీనర్ లు మట్టి పెల్లి సైదులు, కునుకుంట్ల సైదులు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు వేల్పుల వెంకన్న పాల్గొన్నారు.



## జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

ముదిగొండ మండలం జనవరి 13 వాయిస్ టుడే : ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో ఎన్టీఆర్ అభిమానుల సమక్షంలో గ్రామంలోని కోదండ రామాలయం దేవాలయం వద్ద ఎన్టీఆర్ అభిమానులు రూపొందించిన నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ఆవిష్కరణను అభిమానులందరి చేతుల మీదుగా చేశారు ఈ కార్యక్రమంలో సోదరులు అయిన యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు అందరూ వచ్చి దిగ్విజయం చేయడం జరిగింది.

# ఐద్వా 14వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

## ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి



కరీంనగర్,జనవరి 13(వాయిస్ టుడే): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు ఈ నెల 25 నుండి 28 తేదీల వరకు హైదరాబాదులోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా 25వ తేదీన హైదరాబాదు నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్స్ ప్రాంగణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక కోతి రాంపూర్ ముకుంద లాల్ మిశ్రా భవన్ లో జాతీయ మహాసభల సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణ, సంక్షేమం, భద్రత, గౌరవం కోసం ఐద్వా నిరంతరం మిలిటెంట్ పోరాటాలను నడిపింది. పసిపిల్లల నుండి వృద్ధుల వరకు మహిళలపై జరుగు దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, వేధింపులపై రాజీ లేకుండా పోరాడింది అని తెలిపారు. ప్రభుత్వాలు మహిళలను రెండవ పౌరురాలిగా చూస్తున్న పరిస్థితిని తీవ్రంగా ఖండించిన కోనేటి నాగమణి మాట్లాడుతూ స్త్రీ-పురుషులు సమానులే కానీ పాలక వర్గాలు మత భావాలను రెచ్చగొట్టి మహిళలను వంటింటికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆ మనుస్మృతి మైండ్సెట్‌ను విసర్జించాలి" అన్నారు. అలాగే ఆమె కొన్ని ముఖ్యమైన డిమాండ్లు ఉంచారు. 33 శాతం రిజర్వేషన్ పార్లమెంటు మరియు అసెంబ్లీలలో అమలు చేయాలి. మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కల్పించాలి. మహిళలు, బాలికలకు పౌష్టికాహారం మరియు ఆరోగ్య రక్షణ చర్యలు తీసుకోవాలి. లింగవివక్ష నిర్మూలనకు ప్రభుత్వాలు చట్టసభల్లో పురోగతి చూపాలి. మహాసభలను విజయవంతం చేయడానికి గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తూ పెద్ద ఎత్తున మహిళలను సమీకరించనున్నట్లు తెలిపారు. కళాకారులు,మహిళా కవాతు దళాలు, సాంస్కృతిక బృందాలు మహాసభల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 25వ తేదీ బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి ఐక్యతను ప్రదర్శించండి" కోనేటి నాగమణి మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు డి స్వరూప ఈ రజిత టౌన్ ప్రధాన కార్యదర్శి చేని రోజా జిల్లా నాయకురాలు యమునా రజిని మానస తిరుమల రమ కనకలక్ష్మీ,రాజమణి సావిత్రి పాల్గొన్నారు



## సకుర జపాన్ టూర్‌కి ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ రూరల్,జనవరి 13 (వాయిస్ టుడే): భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థుల జపాన్ టూర్ లో సైన్స్ పై అవగాహనకి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సిఈఆర్టి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్ష ద్వారా ఈ సకుర జపాన్ టూర్ కి ఎలగందుల మోడల్ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న గుర్రాల శివాంజలి ఎంపికయ్యారు. విద్యార్థిని ఎంపిక కావడం పట్ల ఎంఈఓ ఆనందం,మోడల్ స్కూల్ ప్రధానాచార్యులు కొడిమ్యాల శ్రీనివాస్,గైడ్ టీచర్ టి .శ్రీనివాస్ , ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు పేరెంట్స్ అభినందించారు.

## రోడ్డు భద్రతే లక్ష్యం -- Arrive Aliveతో అవగాహన

చిగురుమామిడి, డిసెంబర్ 13 (వాయిస్ టుడే) : డీజీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా, చిగురుమామిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందుర్తి గ్రామంలో శుక్రవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిగురుమామిడి ఎస్ఐ ఆధ్వర్యంలో "ాతీతీఅజవ -- ాశ్రీఅజవ" అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తున్న ప్రధాన కారణాలపై వివరించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, అతి వేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, నిర్లక్ష్యంగా వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ లేకుండా ప్రయాణం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అంశాల వల్ల జరిగే ప్రమాదాలు, వాటి కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే నష్టాలను స్పష్టంగా వివరించారు.

అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలు, జరిమానాలు, లైసెన్స్ రద్దు, జైలు శిక్ష వంటి పరిణామాలపై కూడా అవగాహన కల్పించారు. గ్రామ యువత, ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం గ్రామంలో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.




## ప్రధాన ఆసుపత్రి నందు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జనవరి 13: 11.01.2026 నుండి 17.01.2026 వరకు భారతదేశ వ్యాప్తముగా నిర్వహించే జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల కార్యక్రమం లో భాగముగా ఈ మంగళవారము నాడు సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు జాతీయ రహదారి భద్రతా వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఓ ఎం.ఉష హాజరై సింగరేణి ప్రధాన ఆసుపత్రిలోని ఉద్యోగులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సంధర్భముగా ఏఓ ఎం.ఉష మాట్లాడుతూ ఉద్యోగులందరూ రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగిఉండాలనే ఉద్దేశం తో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సంధర్భముగా రహదారులపై ప్రయాణించే డ్రైవింగ్ చేసే సమయం లో తీసుకొనవలసిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి అని, మద్యం సేవించి అస్సలు వాహనం నడపకూడదు అని, డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్‌లను ఉపయోగించకూడదు అని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని మీ భద్రతే మీ కుటుంబ భద్రత అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏఓ ఎం.ఉష, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి. లలిత, వెల్ఫేర్ ఆఫీసర్ ఎండి.ఖలీల్ అహ్మద్, సూపరింటెండెంట్‌లు, డాక్టర్లు, మెయిన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ముగ్గుల పోటీ

మాడ్గులపల్లి జనవరి 14(వాయిస్ టుడే): జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీ ఫేస్-1 లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని ఆకర్షణీయంగా ముగ్గులు వేసిన మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు, నగదు పోటీలో పాల్గొన్న ప్రతీ మహిళకు కన్సలేషన్ బహుమతులు పెద్దలతో పోటీ పడుతూ ఎంతో ఆసక్తిగా ముగ్గులు వేసిన చిన్నారులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులు మా ట్రస్ట్ తరఫున అందివ్వడం జరిగింది అని చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి తెలిపారు. సాంప్రదాయాలు ఉట్టి పడేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ మహిళకు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులకు, కాలనీ వాసులకు, పోటీ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి వెంకన్న, సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు అంజయ్య గౌడ్, కార్యదర్శి గాలయ్య, రంగారెడ్డి, కుమార స్వామి, వెంకటేశ్వర్ రెడ్డి, వాసు యాదవ్, దినేష్, ఓంకార్, అశోక్, సోమేశ్ గౌడ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



## నో హెల్మెట్.. నో పెట్రోల్ అమలు సామాజిక బాధ్యత

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్; వాయిస్ టుడే; జనవరి 13 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతి పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా నో హెల్మెట్.. నో పెట్రోల్ అమలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా జాతీయ మాసోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని పెట్రోల్ బంక్ యజమా నులతో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశంలో గత ఏడాది 4,80,000 ప్రమాదాలు జరిగాయని, దానిలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి రోజు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి చెందుతున్నారని వివరించారు. జిల్లాలో గత ఏడాది 290 ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణ నష్టం జరిగేది ద్విచక్ర వాహన దారులేకేనని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వాహనదా రుడు క్రమశిక్షణ తో వాహనలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించు కోవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు చేయాలని, బంక్ ల లో పని చేసే సిబ్బందికి ఈ సమాచారం చేరవేసి పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ.. ప్రతి బంక్ యజమానులు తమ బంక్ లో నో హెల్మెట్ .. నో పెట్రోల్ ఫ్లెక్సీలు రెండు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో సహకరించాలని సూచించారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, పౌర సరఫరాల అధికారి చంద్ర ప్రకాశ్, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్త కుటుంబానికి అండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### కరుణాకర్ కుటుంబానికి స్వంతంగా రూ.3 లక్షలు, ప్రభుత్వం తరఫున ఒక లక్ష రూపాయలు అందజేసి మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర,జనవరి 13(వాయిస్ టుడే): మండలంలోని ర్యాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గరిగంటి కరుణాకర్ నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు.గతంలోనే బాధ్యత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరుణాకర్ కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఇచ్చిన మాట ప్రకారం నేరుగా కరుణాకర్ ఇంటికి వెళ్లి సొంతంగా 3 లక్షల రూపాయలతో పాటు ప్రభుత్వం తరఫున ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని కరుణాకర్ కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటామని కుటుంబానికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టి కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పెద్దన్నలా అండగా ఉండి ఆదుకుంటామని పేర్కొన్నారు.కాగా కరుణాకర్ కుటుంబానికి అండగా ఉండి ఆదుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు చొప్పదండి నియోజకవర్గం ప్రజల నుండి అభినందనలు వెల్లువెత్తాయి.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### పలువురికి ఆర్థిక సాయం అందజేత

### అర్మేనియాలో మృతి చెందిన మేకల ప్రవీణ్ మృతదేహం స్వగ్రామానికి రప్పించేందుకు చర్యలు : బరోసా ఇచ్చిన ఎమ్మెల్యే

బోయినపల్లి జనవరి 13 వాయిస్ టుడే ప్రతినిధి : బోయినపల్లి మండలం లో వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన మేకల ప్రవీణ్ గత నాలుగు రోజుల క్రితం ఆర్మీనియా దేశంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి మృతదేహాన్ని త్వరగ స్వగ్రామానికి రప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మండల కేంద్రం చెందిన బొడ్డు పరశురాములు గత వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయంని అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రత్నంపేటలో గ్రామపంచాయతీలో విధులు నిర్వహించిన పంచాయితీ కార్మికుడు ఎదురుగట్ల మల్లయ్య మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.దేశాయిపల్లి కి చెందిన మాడిశెట్టి రాయమల్లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మధుగంటి సురేందర్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఏఎంసి వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,సర్పంచులు నల్లమోహన్, బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, కౌడ గాని వెంకటేష్, జంగం అంజయ్య, సుద్దాల మధు,నాయకులు కొలువుల ప్రవీణ్,సంబ లక్ష్మీ రాజం, మెరుపుల జలంధర్, అనంతుల ఆంజనేయులు, నక్క శ్రీకాంత్,తదితరులు ఉన్నారు.

# "వీబీ-జీ రామ్ జీ" పథకం ఎందుకు వద్దు?

**తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు రాబోతున్నాయి**

**నేరుగా డబ్బులన్నీ కూలీల ఖాతాలోనే పడతాయి**

**నిర్ణీత టైంలో పని కల్పించకపోతే వడ్డీతోసహా ఉపాధి భత్యం చెల్లించాల్పిందే**

**ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్‌కు ఎందుకింత అక్కసు?**

**ఎయిర్ పోర్టుకు ఎన్టీఆర్ పేరును తొలగించి రాజీవ్ గాంధీ పేరును పెట్టలేదా?**

**మీరు చేస్తే సంసారం.. మేం చేస్తే వ్యభిచారమా?**

**కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



కరీంనగర్,జనవరి 13(వాయిస్ టుడే): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "వీబీ-జీ రామ్ జీ" పథకం అద్భుతమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. గ్రామానికి స్థిర ఆస్తులను సృష్టించడంతోపాటు ప్రతి ఒక్కరికి కచ్చితంగా 125 రోజుల పని దొరుకుతుందన్నారు. వ్యవసాయ సీజన్ లో కూలీలు దొరకక ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ పథకం ద్వారా ఉపశమనం కల్పించబోతోందన్నారు.గతంతో పోలిస్తే ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.17 వేల కోట్లు కేటాయించబోతోందన్నారు. తెలంగాణకు సైతం రూ.340 కోట్లు అదనంగా రాబోతున్నాయని తెలిపారు. ఇంత గొప్ప పథకాన్ని అడ్డుకోవాలని చూడటం కాంగ్రెస్ నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరును తీసేయడంపై కాంగ్రెస్ అనవసరం రాద్ధాంతం చేస్తోందన్నారు. తొలుత ఈ పథకానికి మహాత్ముడి పేరే కాంగ్రెస్ పెట్టలేదని చెప్పారు.పాలకులు మారినప్పుడు పథకాల పేర్లు మారడం సహజమేనని,గతంలో వాల్మీకీ, అంబేద్కర్ పేర్లతో వాజ్ పేయి ప్రభుత్వం వాంబే స్కీం పేరుతో ఇండ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారి పేర్లను తొలగించి ఇందిరాగాంధీ ఆవాస్ యోజన పథకంగా మార్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు ఎన్టీఆర్ పేరుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుగా నామకరణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ లోని త్రిధా హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ బాస సత్యనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ పథకం ఉద్దేశాలను వివరిస్తూనే. కాంగ్రెస్ తీరుపై నిప్పులు చెరిగారు.ఆయన మాట్లాడుతూ వీబీజీ రామ్ జీ పథకం అనేది గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామానికి దీర్ఘకాలిక ఆస్తులు కూడబెట్టేందుకు ఉద్దేశించినది. ఉపాధి పథకం కింద ఏటా 86 వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసినా గ్రామానికి ఆస్తులు మాత్రం పెద్దగా పెరగ లేదు. తవ్విన గుంతలే తవ్వడం వంటి పనులే చేశారు.ఈ నూతన చట్టబద్ద ఉపాధి హామీ పథకం అమలువల్ల ఏటా 1 లక్షా 51 వేల 282 కోట్ల ఖర్చవుతుందని ప్రభుత్వ అంచనా."వీబీ-జీ రామ్ జీ" అనే పథకం కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యం తప్పనిసరి. ఇందులో కేంద్రం వాటా 95 వేల 692 కోట్లు. అట్లాగే అన్ని రాష్ట్రాల వాటా మొత్తం కలిపి 55 వేల 589 కోట్లు.గత ఏడాదితో పోలిస్తే దేశవ్యాప్తంగా ఈ ఏడాది 17 వేల కోట్లు అదనంగా కేంద్రం ఖర్చు చేయబోతోంది.తెలంగాణ రాష్ట్రానికి కూడా గత ఏడాదితో పోలిస్తే సుమారు 340 కోట్లు అదనంగా కేంద్రం అందించబతోంది."వీబీ-జీ రామ్ జీ" కూలీలకే కాదు, రైతుల నెత్తిన పాలుపోసే పథకం.ఈ కొత్త చట్టంతో వ్యవసాయ సీజన్ లో గరిష్టంగా 60 రోజుల పాటు ఈ చట్టం కింద పనులు చేపట్టకుండా నోటిపై చేసే అధికారం రాష్ట్రాలకు ఇచ్చినం. దీనివల్ల రైతులకు అదనపు భారం ఉండదు. పేదల కూలీ పనులకు ధోకా ఉండదు.వ్యవసాయ సీజన్ లో కచ్చితంగా ఏటా 60 నుండి 80 రోజుల పని దొరుకుతుంది.ఇవిగాక జీ రామ్ జీ పథకం ద్వారా 125 రోజుల పని పక్కా.మొత్తంగా ఏటా సగటున 200 రోజులు పని పక్కా. ఈ పథకం సమర్థవంతంగా అమలవ్వడానికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన నిధులను 6 నుండి 9 శాతానికి పెంచినం.ఉపాధి పనుల ఎంపిక గ్రామ సభల ద్వారా ఎంపిక. పనుల ద్వారా గ్రామానికి ఆస్తులను నిర్మించాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. కేంద్ర ప్రభుత్వం గైడ్ గా వ్యవహరిస్తోందే తప్ప అజమాయిషీ చేయదు.ప్రజలకు మంచిజరుగుతుంటే కాంగ్రెస్ కు అక్కసు ఎందుకు? గ్రామానికి ఆస్తులు నిర్మించడం తప్పా? రైతులకు కూడా మేలు జరిగే పథకం కదా? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా? వీబీ జీ రామ్ జీ పథకం కావాలా? వద్దా? కాంగ్రెస్ స్పష్టం చేయాలి.ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై నీచ రాజకీయడం సిగ్గు చేటు. వాల్మీకీ అంబేద్కర్ ఆవాస్ యోజన(వాంబే) పేరుతో వాజ్ పేయి తెచ్చిన ఇండ్ల నిర్మాణ పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారు?వాల్మీకీ, అంబేద్కర్ పేర్లను తీసేసి ఇందిరా ఆవాస్ యోజన పథకంగా ఎందుకు మార్చారు? వాల్మీకీ, అంబేద్కర్ వంటి వారిని అవమానించినట్లా? హైదరాబాద్ ఎయిర్ పోర్టు టెర్మినల్ ను గతంలోఎన్టీఆర్ టెర్మినల్ ఉంటే తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అని ఎందుకు పెట్టారు?గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేసిన 'ఘాంఢీ' వారసులు కాంగ్రెస్ నేతలు.వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించిన గాంధీ ఆశయాలను నీరుగార్చారు.కాంగ్రెస్ అంటే జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ,రాజీవ్ గాంధీ, సోనియాగాంధీ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వీళ్లే కదా? మహాత్మా గాంధీ నిజంగా బతికుంటే మిమ్ముల్ని, మీ ఘాంఢీ కుటుంబ వారసులను చూసి పైనున్న గాంధీ ఆత్మ క్షోభిస్తోంది. పథకాల మార్పుపై కాంగ్రెస్ చేస్తే సంసారం. మేం చేస్తే వ్యభిచారమా?శ్రీరాముడి పేరును బతికినంత కాలం పెట్టుకుంటాం.మా కార్యకర్తలు ఎక్కడికి పోయినా జైశ్రీరాం అంటారు.మా ఊపిరి ఆగిపోయే క్షణంలో కూడా భారతమాతా కీ జై జై శ్రీరాం అంటాం. నక్సల్స్ కాల్చి చంపుతుంటే కూడా భారతమాతాకీ జై జై శ్రీరాం అని నినదించిన చరిత్ర బీజేపీది. రాముడి బాటలో నడుస్తాం.రాముడి ఆలయాలను నిర్మిస్తాం.మీకు నొప్పి ఏంది?.దేశంలో అనేక పథకాలు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నడుస్తున్నయే కదా?ఈ పథకానికి రాష్ట్రాల భాగస్వామ్యం కల్పిస్తే తప్పేంది? ఉపాధి కూలీ వేతనాలే సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలా మాట్లాడేది? జిల్లాల పునర్ వ్యవస్థీకరణ విషయంలో కేసీఆర్ ఇష్టానుసారంగా వ్యవహరించారు.కుటుంబ ఆస్తులను పంచినట్లుగా కొడుకు,కూతురు, అల్లుడి కోసం జిల్లాలను ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అదే తీరులో చేస్తే ఇబ్బందులు తప్పవు. తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి.ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి.బీసీ రిజర్వేషన్లపై బీజేపీ స్టాండ్ క్లీయర్ గా ఉంది.మతపరమైన రిజర్వేషన్లను తొలగించాల్సిందే.బీజేపీ అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను తొలగించి బీసీలకు రిజర్వేషన్లను అమలు చేసి తీరుతాం.

## ఓటరు లిస్టులో తప్పులు సరిదిద్ది బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్,జనవరి 13(వాయిస్ టుడే): రాత్రికి రాత్రే ఓటర్ లిస్ట్ ను మార్చిన వ్యక్తులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు సరియైన ఓటర్ లిస్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతిని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఓటర్ లిస్టు నిన్నటి రోజున రాత్రికి రాత్రే మార్చారని,కేవలం ఇది బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లు వారికి దక్కకుండా చేసిన కుట్రలో భాగంగానే జరిగిందన్నారు.బిఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్ బిజెపికి వణుకు పుడుతుందన్నారు.తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితా పై రెండు పార్టీలు స్పందించకపోవడం పట్ల వారి ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు.ఎమ్మెల్యే ఇంటి ఓటర్ లిస్ట్‌ను తామునివసిస్తున్న డివిజన్ కాకుండా వేరే డివిజన్ కు మార్చడం పట్ల ఎవరి హస్తముందో తేల్చాలని డిమాండ్ చేశారు.ఒక ఎమ్మెల్యేకి ఇలా జరిగితే మిగతా సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని అధికారులను నిలదీశారు. ఓటర్ లిస్ట్ రూపొందించిన సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ వద్ద ఎవరు ఉన్నారు.జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు లేకుండానే ఈ మార్పులు ఎలా జరిగాయి అని ప్రశ్నించారు.ఎన్నికల కమిషన్‌కు తెలియకుండా ఇంత పెద్ద ఎత్తున అవకతవకలు ఎలా జరిగాయన్న విషయాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకునే ఉద్దేశంతోనే కావాలనే ఓటర్ లిస్ట్‌ను తప్పుల తడకగా తయారు చేశారని గంగుల ఆరోపించారు.ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రేపటి వరకు బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని. మరల సరియగు ఓటర్ లిస్ట్ ప్రకటించాలని లేనిచో ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పీఠం బిఆర్ఎస్ పార్టీదే : మాజీ మంత్రి గంగుల



కరీంనగర్,జనవరి 13(వాయిస్ టుడే): నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన నగరానికి సంబంధించిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఉపయోగపడే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎప్పుడెప్పుడా ఎన్నికలు వస్తాయా బిఆర్ఎస్ పార్టీ నీ గెలిపించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.తెలంగాణలో మళ్లీ అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అప్పటి వరకూ పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై,వారి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ రెండేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు.ప్రజల్లో ఈ రెండు పార్టీలపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులనుతయారు చేస్తుందన్నారు.కరీంనగర్ మున్సిపల్ ఎన్నికలకు ఇంచార్జిలుగా మాజీ మంత్రి హరీష్ హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌లు కుమార్ ఉంటారని తెలిపారు. ఎప్పుడూ ఎన్నికలు వచ్చిన సిద్ధంగా ఉన్నామని సరైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు.ఒక్కో డివిజన్‌కు ఒక్కొక్కరు బాధ్యతలు తీసుకుని ముందుకు సాగుతామని వెల్లడించారు. కొంతమంది పార్టీని వదిలి వెళ్లినా తమకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు.ఎన్ని సర్వేలు చేసినా విజయం బీఆర్ఎస్‌పార్టీదేనని, నూటికి 90 శాతం ఫలితాలు మనకే అనుకూలంగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోవు కాలంలో కేసీఆర్ నాయకత్వంలో రానున్న15 ఏళ్లు బీఆర్ఎస్‌పార్టీఅధికారంలో ఉంటుందన్నారు.ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు సూచించారు. ఈ నెల 19న కేటీఆర్ కరీంనగర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు,పార్టీ ముఖ్య నాయకులు ఆయా డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.